క్లుప్తంగా

శాస్త్ర సాంకేతిక అభివృద్ధితోనే దేశప్రగతి



అధ్యాపకులతో లింగేశ్వర్‌రెడ్డి

హుజూరాబాద్: కొత్త ఆవిష్కరణలు జరిగేలా అధ్యాపకులు బోధన చేయాలని ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ సెంటర్ మేనేజర్ బీమా లింగేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన బుధవారం ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు నేర్చుకున్న అంశాలను క్రోడీకరించి మేధాపరమైన సూచనలను పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వాలకు అందించాలని, కనుగొన్న కొత్త విషయాలకు పేటెంట్ తీసుకోవాలని సూచించారు. దేశ ప్రగతి శాస్త్ర సాంకేతిక అభివృద్ధి మీద ఆధారపడి ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన ఆవిష్కరణలు, ఇంజనీరింగ్ కళాశాలలకు ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తున్నాయని అధ్యాపకులు, మేనేజ్‌మెంట్ వాటిని సద్వినియోగం చేసుకొని పరిశోధనలు కొనసాగించాలన్నారు. విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేసేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కళాశాల ఇన్నోవేషన్ సెంటర్ కోఆర్డినేటర్ ప్రశాంత్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

హుజూరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని బీఆర్‌ఎస్ నాయకుడు బండ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు మంచి భోజనం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్ ఉన్నారు.

ఎంపీడీవో విచారణ

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణపై ఎంపీడీవో భీమేశ్ బుధవారం విచారణ చేపట్టారు. మధ్యాహ్న భోజనంపై హెచ్‌ఎం సమ్మయ్య ఫిర్యాదుతో విచారణ చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సమ్మయ్య, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, కార్యదర్శి రామారావు, సీసీ వినోద, మహిళా సంఘం అధ్యక్షురాలు బండారి రజిత తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు వినియోగించుకోవాలి



కుట్టు శిక్షకులతో సంస్థ ప్రతినిధులు

గంగాధర: గ్రామాల్లో స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల ఫోరం జేఏసీ జిల్లా మాజీ అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం సూచించారు. మండలంలోని కాచిరెడ్డిపల్లి గ్రామంలో మానిస్ యూనిదాస్ స్వచ్ఛంద సంస్థ, ఫాతిమా అడోరేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరుబావితో పాటు కుట్టుశిక్షణ కేంద్రాన్ని స్పెయిన్ నుంచి వచ్చిన సంస్థ ప్రతినిధి రోషియో అల్బర్ట్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. గ్రామీణ పేద మహిళలు ఆర్థికంగా ఎదగడానికి స్వచ్ఛంద సంస్థ సహకారం అందిస్తుందన్నారు. ఈసందర్భంగా మహిళల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంస్థ ప్రతినిధులు అనీష్‌ప్రీత, వేలంకని, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, స్రవంతి, రమేశ్, మౌనిక, జమున పాల్గొన్నారు.

వర్గీకరణ అమలు చేయాలి



మాట్లాడుతున్న అనిల్

గన్నేరువరం: కమిటీలు, కమిషన్ల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండల ఇన్‌చార్జి కనకం అంజిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఎమార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ విభాగాల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోర్టు ద్వారా సాధించుకున్న న్యాయమైన విజయం జాతికి అందకుండా కుట్రలు జరుగుతున్నాయని, ఉద్యోగ నియామకాలు వర్గీకరణ లేకుండా భర్తీ చేస్తూ ప్రభుత్వం నమ్మకద్రోహం చేస్తోందని మండిపడ్డారు. ఎమార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునీందర్, నాయకులు కవ్వంపల్లి రాజయ్య, మాతంగి అనిల్, కల్లెపెల్లి కొమురయ్య, వేదిరె రాజయ్య, గూడెపు లింగయ్య, సురేశ్, రాజయ్య, లక్ష్మణ్, రాములు, రాజమల్లు, చుక్కయ్య పాల్గొన్నారు.

సదస్సులు.. సత్వర పరిష్కారం

- విద్యా సంస్థల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు
- చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తులు
- లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులకు మోక్షం



హుజూరాబాద్ గురుకుల బాలికల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న జడ్జీలు

హుజూరాబాద్: ఉచిత న్యాయ సేవలు అందించడంతో పాటు సమస్యల సత్వర పరిష్కారానికి మండల న్యాయ సేవాధికార సమితి కృషి చేస్తోంది. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా నిరక్షరాస్యులు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తోంది. లోక్ అదాలత్ రూపంలో పెండింగ్ కేసులకు మోక్షం లభించేలా చొరవ తీసుకుంటోంది. న్యాయస్థానాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారికి వ్యయ, ప్రయాసల భారాన్ని తప్పిస్తూ భరోసానిస్తోంది. చట్టాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు హుజూరాబాద్ న్యాయమూర్తులు ప్రత్యేక చొరవ తీసుకుంటూ న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు -1987 దేశవ్యాప్తంగా 1995 నవంబర్ 9న అమల్లోకి వచ్చినప్పటి నుంచి. జాతీయ స్థాయిలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, రాష్ట్ర స్థాయిలో స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా స్థాయిలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఇక తాలూకా స్థాయిలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ (మండల న్యాయ సేవాధికార సమితి) సేవలు అందుతున్నాయి. మండల న్యాయ సేవాధికార సమితి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది.

అందించే సేవలు

నిర్దేశిత కోర్టుల పరిధిలో మండల న్యాయసేవాధికార సమితి కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలి. కాగితంపై సమస్య వివరిస్తూ ఆధారాలు జత చేయాలి. సాయం పొందాలనుకునే వ్యక్తి నిరక్ష్యరాసులైతే రాసిస్తారు. రూ.మూడు లక్షల లోపు వార్షిక ఆదాయం ఉంటే ఉచిత సేవలు, న్యాయవాదిని ఏర్పాటు, కోర్టు రుసుము మినహాయిస్తారు. కేసులకు సంబంధించి రాజీ కుదుర్చుకునే ప్రక్రియలో భాగంగా న్యాయ సేవాధికార సమితిని ఆశ్రయిస్తే అంతకుముందు కోర్టుకు చెల్లించిన రుసుము తిరిగి చెల్లించడంతోపాటు విచారించి తగిన చర్యలు తీసుకుంటారు. జిల్లా స్థాయిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, రాష్ట్ర స్థాయిలో సభ్య కార్యదర్శి(హైదరాబాద్), అక్కడ పరిష్కారం కాకపోతే హైకోర్టులోని న్యాయసేవాధికార సంస్థ సంఘం భవన్‌లో సంప్రదించాలి.

సదస్సులకు విశేష స్పందన

విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి చట్టాలపై అవగాహన కల్పిస్తే క్రమశిక్షణతో చట్టాలకు లోబడి ఉన్నతంగా ఎదుగుతారనే లక్ష్యంతో విద్యా సంస్థల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నారు. హుజూరాబాద్ కోర్టులో పనిచేస్తున్న జడ్జీలు న్యాయ విజ్ఞాన సదస్సులో చట్టాలపై విద్యార్థులకు సంపూర్ణంగా అవగాహన కల్పిస్తున్నారు. చట్టాలను అతిక్రమిస్తే విధించే శిక్షలు, చట్ట పరిధిలో ఎలా జీవించాలన్న అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా చెబుతున్నారు. సదస్సులకు విశేష స్పందన వస్తుండటంతో న్యాయమూర్తులు చట్టాలపై మరింత విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

అవగాహన ఉండాలి



ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి. ముఖ్యంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండటం తప్పనిసరి. అప్పుడే క్రమశిక్షణ అలవుడుతుంది. విద్యా సంస్థల్లో చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడం శుభపరిణామం.

– బి. శ్రీనివాస్, ఎంఈవో, హుజూరాబాద్

విద్యార్థులకు అవసరం



ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఎంతో ముఖ్యం. పాఠశాలల్లో నిర్వహిస్తున్న న్యాయ విజ్ఞాన సదస్సుల్లో న్యాయమూర్తులు విద్యార్థులకు చట్టాలు అర్థమయ్యేలా చెబుతున్నారు. విద్యార్థులు కూడా శ్రద్ధగా వింటున్నారు.

– అనురాధ, హెచ్‌ఎం, చెల్పూర్

ఆసక్తిగా వింటున్నారు



న్యాయ విజ్ఞాన సదస్సులతో విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావచ్చు. చట్టాల లాభనష్టాలు వివరిస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న న్యాయ విజ్ఞాన సదస్సులను విద్యార్థులు సైతం ఆసక్తిగా వింటున్నారు.

– గొస్కుల శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, హుజూరాబాద్

శుభ్రతపై అవగాహన



పోషకాహారం, శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న యూనివర్సిటీ విద్యార్థులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పోషకాహారం, పరిశుభ్రత, కాలుష్యం వల్ల కలిగే అనర్థాలపై మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రీ విద్యార్థులు బుధవారం అవగాహన కల్పించారు. రోగనిరోధక శక్తి పెంచుకోవాడానికి మంచి పోషకాహారం తీసుకోవాలని, శుభ్రత పాటించాలని వివరించారు. కార్యక్రమంలో మనీషా, మతంకి, మనస్విని, ముస్కాన్, కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి, ఉపాధ్యాయుడు అశోక్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

హుజూరాబాద్: మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో బుధవారం జయన్న ఫౌండేషన్ నిర్వాహకులు సరిత జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 600 మందికి వైద్య సిబ్బంది వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి సమస్య తీవ్రంగా ఉన్న 150 మందిని ఆపరేషన్ కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశామన్నారు.

షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లిలో బుధవారం చొప్పదండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డయాబెటీస్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. 105 మందికి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లేశం, కార్యదర్శి రాజేశ్ పవార్, గ్యాజంగి రాములు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

జమ్మికుంట: కరీంనగర్‌లో 29, 30వ తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో మాట్లాడారు. ప్రజా సమస్యలపై ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలను మహాసభల్లో సమీక్షించుకొని భవిష్యత్ కార్యాచరణ, తీర్మానాలు చేస్తామన్నారు. ప్రజల పక్షాన సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శీలం అశోక్, కమిటీ సభ్యులు జక్కుల రమేశ్ పాల్గొన్నారు.

దుస్తుల అందజేత

చొప్పదండి: పట్టణంలోని రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీ స్కూల్ విద్యార్థులకు స్థానిక కౌన్సిలర్ నలుమాచు జ్యోతి బుధవారం యూనిఫామ్స్ అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్ మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగుల నిరసన



శంకరపట్నం: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కేశవపట్నం కేజీబీవీ ఉద్యోగులు బుధవారం నిరసన తెలపగా యూటీఎఫ్ నాయకులు మద్దతు పలికారు. కేజీబీవీలో చిల్డ్రన్‌కేర్ టేకర్లను నియమించాలని యూటీఎఫ్ నాయకుడు ఎంఏ.ఖాద్రీ డిమాండ్ చేశారు. పనిభారం ఎక్కువ అవుతన్నా వేతనాలు పెరగడం లేదని మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ నాయకులు శ్రీనివాస్, అలీం, స్పెషల్ ఆఫీసర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి పోటీలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో నిర్వాహకులు

చొప్పదండి: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో బుధవారం మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో డి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాయితో నిప్పును రాజేసిన కాలం నుంచి నింగిలోకి రాకెట్‌ను ప్రయోగించే వరకు సైన్స్ ప్రస్థానం గొప్పదన్నారు. టెస్టులో విజేతలుగా ఆర్నకొండ టీం, జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ విద్యార్థి డి. శ్రీరుతిక్, వీణాధరి పాఠశాల విద్యార్థి కె. సాత్విక్, రెవెల్లికి చెందిన సాహిత్య బహుమతులు గెలుపొందారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

గంగాధర: మండలంలోని రంగరావుపల్లి గ్రామం ఎస్సార్ ప్రైమ్ స్కూల్ విద్యార్థి వేసుగంటి సహాస్ జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. బిహార్‌లోని బుద్ధగయలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరుపున పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. విద్యార్థిని ఎస్సార్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి తిరుపతి, అకాడమిక్ డీన్ రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నియామకం



బాలకృష్ణను సన్మానిస్తున్న పెర్క సంఘం నాయకులు

హుజూరాబాద్: జిల్లా ఫర్టిలైజర్ సంఘం జాయింట్ సెక్రెటరీగా హుజూరాబాద్‌కు చెందిన అచ్చ బాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు బుధవారం పెరుక సంఘం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. పెరుక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రమేశ్, పోతరాజు శ్రీనివాస్, రజనీకాంత్, బండి రమేశ్, పోతరాజు వీరయ్య, ముక్కెర కనకయ్య, ఉగ్గే పరమేశ్వర్, సందెల వెంకన్న, పోతరాజు ప్రవీణ్, పత్తిపాక విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రామడుగు అధ్యక్షుడిగా హరీశ్

రామడుగు: కాంగ్రెస్ పార్టీ రామడుగు అధ్యక్షుడిగా మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన జువ్వాజీ హరీశ్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం హరీశ్‌కు నియామక పత్రం అందించారు. నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు సత్యం, కవ్వంపల్లికి హరీశ్ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు.

సన్మానం

చిగురుమామిడి: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. చిగురుమామిడి రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో తిరుపతిరెడ్డిని ఘనంగా సన్మానించారు. మార్కెట్ యార్డును మరింత విస్తరించాలని కోరారు. రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, రాజిరెడ్డి, ఇనుగాల శ్రీనివాస్‌రెడ్డి, శ్యామకూర సంపత్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు తరలిరావాలి

గంగాధర: అలుగునూర్‌లో 29న నిర్వహించే దీక్షా దివస్‌కు చొప్పదండి నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బుధవారం నాయకులు, కార్యకర్తలతో దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి**

సైదాపూర్: విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర నాయకుడు కొత్తపల్లి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడి విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని అమలు చేయలేదన్నారు.

- **సమస్య పరిష్కరించాలని నిరసన**

గన్నేరువరం: చీమలకుంటపల్లెలోని కొందరు గ్రామస్తులు నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తమ భూముల నుంచి వెళ్లే రోడ్డు గుండా వెళ్లనీవ్వడం లేదన్నారు. గతంలో కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనికి నిరసనగా బుధవారం రోడ్డు బంద్ చేశామన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

- **రైతుభరోసాపై రైతుల్లో అయోమయం**

వీణవంక: యాసంగి సీజన్ ప్రారంభమైన రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాలో వేయడంలేదని, రైతుభరోసాపై రైతుల్లో అయోమయం నెలకొందని బీఆర్‌ఎస్ మండల నాయకుడు కొక్కిరాల శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. రైతులు పెట్టుబడికి ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ రైతుబంధు పథకం ప్రవేశపెడితే సన్న, చిన్నకారు రైతులకు ఎంతో మేలు జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధుకు ఎగనామం పెట్టారని ఆరోపించారు. వానాకాలం, యాసంగి సీజన్ల డబ్బులు రైతుల ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు.

- **మాలధారణకు ఏర్పాట్లు**

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో అయ్యప్ప మండల దీక్షకు మాలధారణ కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్ తెలిపారు. బుధవారం చొప్పదండితో పాటు కరీంనగర్‌కు చెందిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పాలోజు చరణాచార్యులు మాలధారణ చేశారని, మాలధారణ చేసుకునే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

సీతారాంపూర్‌లో..

చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో బుధవారం అయ్యప్ప మాలధారణస్వామి హనుమాండ్ల సతీశ్‌పద్మారెడ్డి ఇంటిలో పడిపూజ నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణేశ్వరస్వామి, అయ్యప్పస్వాములకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణతో పాటు పట్టువస్త్రాలు సమర్పించారు. వేదమంత్రోచ్చరణల మధ్య స్వామివారికి గంధం, చందన, పన్నీరాభిషేకం చేశారు. అనంతరం దీక్ష తీసుకున్న అయ్యప్పస్వాములు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పునఃప్రారంభం



బంక్‌ను ప్రారంభిస్తున్న వెంకటరమణారెడ్డి

చిగురుమామిడి: రైతులు, వాహనదారులకు 24 గంటలు పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా చిగురుమామిడి సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను పునఃప్రారంభించామని చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని గునుకులపల్లెలో రెండేళ్ల క్రితం మూతబడిన బంక్‌ను బుధవారం ప్రారంభించారు. రైతులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మెన్ కరివేద మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు ముద్రకోల రాజయ్య, అందె స్వామి, కూతురు రవీందర్‌రెడ్డి, పోతరవేని శ్రీనివాస్, తాళ్లపల్లి తిరుపతి, పేరాల లక్ష్మి, మాచమల్ల లచ్చవ్వ, సీఈఓ కాటం నర్సయ్య, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



మానకొండూర్: మండలంలోని అన్నారం శివారులో కరీంనగర్-జమ్మికుంట రహదారి మధ్యలో కల్వర్టు నిర్మాణ పనులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు పక్క నుంచి వెళ్లేలా ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయకుండానే కల్వర్టు పనులు చేపట్టారని, దీంతో జమ్మికుంట, కరీంనగర్‌కు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు ఈదులగట్టెపల్లి మీదుగా వెళ్తూ నానా తంటాలు పడుతున్నారు. అదనంగా ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సెల్ నం: 94408 18867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

గల్ఫ్ కార్మికులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రొసీడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర: గల్ఫ్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆపదలో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన సందరగిరి రమేశ్ జీవనోపాధి గల్ఫ్ వెళ్లి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరుపున మంజూరైన రూ.ఐదు లక్షలలకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నారై పాలసీ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పురమల్ల మనోహర్, దోమకొండ మహేశ్,దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, మ్యాక వినోద్,సురేష్, కార్తిక్, తిరుపతి ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలవినతి

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలోని ఔదర్‌పల్లి వాటర్ ట్యాంకు నుంచి వెదిర గ్రామ పరిధిలోని వెంకటగిరి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అవరసమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ గంగాధర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య, నాయకులు అమిరిశెట్టి సుధాకర్, రత్నాకర్ బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతి పత్రం అందజేశారు. మట్టి రోడ్డుతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

- **హార్వెస్టర్‌లో మంటలు**

హుజూరాబాద్: హార్వెస్టర్ రిపేరు చేస్తుండగా మంటలు చేలరేగిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని వరంగల్ రోడ్డులో ఓ మెకానిక్ షాపులో చిన్నపాపయ్యపల్లె గ్రామానికి చెందిన కోమల్ రెడ్డి హార్వెస్టర్ రిపేర్ చేస్తుండగా మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్‌ఇంజిన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు.

- **పశుగ్రాసం దగ్ధం**

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామంలో బుధవారం పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... మానకొండూర్‌కు చెందిన ఓ రైతు ఎరడపల్లి గ్రామం నుంచి ట్రాక్టర్‌లో పశుగ్రాసాన్ని తరలిస్తుండగా గంగిపల్లి జీపీ ఎదుట విద్యుత్ తీగలు పశుగ్రాసానికి తగలడంతో నిప్పులు చెలరేగాయి. డ్రైవర్ పశుగ్రాసాన్నీ అన్‌లోడ్ చేయడంతో ప్రమాదం తప్పింది. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు.

- **సెల్‌ఫోన్లు అప్పగింత**

హుజూరాబాద్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేయగా బుధవారం ఏసీపీ శ్రీనివాస్‌జి బాధితులకు అందజేశారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సుమారు 50 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, ఫోన్ పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈసందర్భంగా బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రామడుగు: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్లు రికవరీ చేసి బుధవారం బాధితులకు అందజేశామని ఎస్సై వి.శేఖర్ తెలిపారు. గంటె మునీందర్, బొడ్డ రామ్‌చరణ్ ఫోన్లు పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించామన్నారు.

- **పోయిన బ్యాగు...**

గంగాధర: ఆటోలో బ్యాగును పోగొట్టుకున్న బాధితురాలికి బ్యాగుతోపాటు అందులోని పది తులాల బంగారం అప్పగించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. లక్ష్మీదేవిపల్లికి చెందిన ఓ మహిళ తల్లితో కలిసి కరీంనగర్‌లో ఆటో ఎక్కి గ్రామంలో దిగింది. బ్యాగ్ తప్పిపోయిందని గ్రహించి పోలీస్ స్టేషన్‌కు రాగా ఎస్ఐ నరేందర్ రెడ్డి హెడ్‌కానిస్టేబుళ్లు రాజయ్య, కృష్ణారెడ్డి స్పందించి ఆటోను ట్రేస్ చేసి వేములువాడ వద్ద పట్టుకున్నారు.

- **కానిస్టేబుల్‌పై కేసు నమోదు**

జమ్మికుంట: ఇటీవల ట్రెనింగ్ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ ఓ స్వీట్ వ్యాపారిపై దాడికి పాల్పడగా కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి బుధవారం తెలిపారు.

- **యువకుడి ఆత్మహత్యాయత్నం**

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు(21)పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తుల తెలిపిన వివరాలు.. యువకుడి కుటుంబం కొంత కాలంగా కనపర్తి గ్రామంలో నివసిస్తోంది. కుటుంబంలో జరిగిన చిన్నగొడవతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. స్నేహితులు, కుటుంబీకులు జమ్మికుంటలోని ఆసుపత్రికి తరలించారు.

- **గుండెపోటుతో నాయకుల మృతి**

రామడుగు: మండలంలోని గుండి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు పొన్నం శ్రీనివాస్‌గౌడ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్‌ను బుధవారం తెల్లవారుజామున చికిత్స కోసం కరీంనగర్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాస్‌గౌడ్ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

శంకరపట్నం: టీడీపీ శంకరపట్నం మండల అధ్యక్షుడు సయ్యద్ ఆరీఫ్ గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కొనసాగుతూ దివంగత మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా పేరొందారు. బుధవారం ఛాతీలో నొప్పిరావడంతో కుటుంబసభ్యులు, స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

- **ఇసుక ట్రాక్టర్ పట్టివేత**

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని టౌన్ సీఐ వరంగంటి రవి బుధవారం తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి రమేశ్ ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

- **అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు**

రామడుగు: మండలంలోని వెలిచాల అనాథ ఆశ్రమంలో ఉంటున్న అనాథ వృద్ధురాలు చిగురుమామిడికి చెందిన కుంట్ల దేవక్క బుధవారం మృతి చెందగా స్పందన అనాథ ఆశ్రమ వృద్ధుల నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్ ఆమె అంత్య క్రియలు నిర్వహించారు.

- **పరామర్శ**

వీణవంక: మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్ల కొండాల్‌రెడ్డి తండ్రి పుల్లారెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పరామర్శించారు. శ్రీరాములపేట, లస్మక్కపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో మృతుల కుటుంబాలను పరామర్శించి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు.